■ నెమలూరి భాస్కరరావు

# బాధాసప్తశతి

చలపతి పంపిన శుభలేఖ అందింది. వాడి కొడుకు పెళ్ళి రేపుగాక ఎల్లుండే! శుభలేఖతో పాటు వాడు మరో ఉత్తరం కూడా రాశాడు.

ఒరేయ్ నూరీ!

పెళ్ళి, ముహూర్తం హడావిడిగా కుదిరాయి. టైమ్ చాల్లేదు. అందువల్ల శుభలేఖలు ముందుగా పంపించలేకపోయాను. అందుకే ప్రత్యేకంగా ఈ ఉత్తరం. నువ్వు తప్పక రావాలి. నీతో చాలా మాట్లాడాలి. నాకు నీ సలహా ఒకటి కావాలి. ఎన్ని పనులున్నా వెధవా, తప్పక పెళ్ళికి రా!

"చలపతి"

చలపతీ, నేనూ బాల్యస్నేహితులం, ఆప్తమిత్రులం. వాడు పల్లెటూళ్ళో వ్యవసాయానికి పరిమితమైనా, నేను పట్నంలో ఉద్యోగం చేస్తున్నా మా స్నేహం బాల్యం నుంచీ సజీవంగా ఇప్పటిదాకా నిలిచే ఉంది. వాడు నా దగ్గరకు రావడమో, నేను వాడిదగ్గరికి వెళ్ళడమో ఇది నిరంతరాయంగా జరుగుతూనే ఉంది. నేను గుంటూర్లో ఉద్యోగం చేస్తున్నాను. వాడు గుడివాడ పక్కన ఉన్న జొన్నపాడులో వ్యవసాయం చేస్తున్నాడు. చలపతికి జొన్నపాడు గ్రామంలో పది ఎకరాల మాగాణి ఉంది. పది ఎకరాలంటే సామాన్యం కాదు. ఎకరం లక్షన్నరదాకా ధర పలుకుతోంది. వాడు నాతోపాటు డిగ్రీవరకు చదివినా, ఉద్యోగం కన్నా వ్యవసాయాన్నే ప్రేమించాడు. అదీకాక వాడికి చదువు పూర్తి అయ్యేనాటికి ముగ్గురు అప్పచెల్లెళ్ళు. వాళ్ళ పెళ్ళిళ్ళూ, పేరంటాలూ... బాధ్యత అంతా చలపతిదే. వాడు డిగ్రీ పరీక్షలు రాసిన తరువాత తండ్రి చనిపోయాడు. చలపతి ఒక్కడే కొడుకు. ఆడపిల్లల బాధ్యత వాడి నెత్తిమీద పడింది. వాళ్ళ పెళ్ళిళ్ళ కోసం వాడు అయిదు ఎకరాల పొలం అమ్మాడు. దాంతో పదిహేను ఎకరాల పొలం కాస్తా పది ఎకరాలైంది.

చలపతి ప్రేమ వివాహం చేసుకున్నాడు. మరెవర్నో కాదు, మేనత్త కూతుర్నే. వాళ్ళు పెద్దగా ఉన్నవాళ్ళేం కాదు. ఆ కారణంగా చలపతికి ఆస్తిపాస్తులు అదనంగా పెరగనూ లేదు, తరగనూ లేదు.

చలపతిగాడి కొడుకు పెళ్ళికి నేను వెళ్ళక తప్పదు. వెళ్ళాలనే నిర్ణయించుకున్నాను.

* * *

పెళ్ళిరోజు ఉదయం పదకొండు గంటలకల్లా నేను జొన్నపాడు వెళ్ళి చలపతిగాడింట్లో దిగబడ్డాను. ఆ రాత్రి తొమ్మిది గంటలకు పెళ్ళి. నన్ను చూసి వాడు చాలా సంతోషించాడు. వాడి భార్య ముఖం చాటంత చేసుకుంది. "మీరొక్కరే వచ్చారేం అన్నయ్యగారూ! వదినగార్ని కూడా తీసుకురావాల్సింది" అంది.

"ఈసారికి ఇలా పోనీ అమ్మాయ్! ఇంకా ఇద్దరు కొడుకులకు పెళ్ళిళ్ళు చేస్తావు కదా! అప్పుడు నువ్వు కోరిన విధంగానే చేస్తాను" అన్నాను, ఓ అనవసరపు నవ్వు నవ్వి. ఈలోగా ఎవరో వచ్చి ఆవిణ్ణి పిలుచుకెళ్ళారు. పెళ్ళికి తరలివెళ్ళే హడావిడి. అందునా ఆవిడ పెళ్ళి కొడుకు తల్లి. నిలబడ్డ చోట ఉండకుండా ఆవిడ అటూ ఇటూ సగర్వంగా తిరుగుతోంది.

"ఒరేయ్ నూరీ! సాయంకాలం నాలుగ్గంటలకు బయల్దేరాలి. ఇక్కణ్ణించి రెండు బస్సులు మాట్లాడాను. భోజనం చేసి విశ్రాంతి తీసుకో. ప్రత్యేక మార్యాదలేం కుదరవు. నాకు పనుంది వెళ్ళొస్తాను" అంటూ ఎటో మాయమయ్యాడు చలపతి.


పిల్లది గుడ్లవల్లేరట. గుడివాడకు పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంతా కలిపి జొన్నపాడు నుంచి బస్సులో అయితే ఓ గంట ప్రయాణం. ఇల్లంతా సెంటు వాసనలూ, పట్టు చీరల గరగరలూ, పిల్లల హడావిడీ. నాకు తెలిసున్నవాళ్ళు చాలా తక్కువ మందే ఉన్నారు. ఆ కారణంగా నేను చెరువు మధ్యలో ఉండే రాటలా నిలబడి దిక్కులు చూడసాగాను. ఈలోగా ఆపద్బాంధవుడిలా ప్రత్యక్షం అయ్యాడు మా చలపతిగాడి రెండో కొడుకు రవి. వాడికి పదిహేనేళ్ళుంటాయి. పదవ తరగతి పరీక్షలు రాశాట్ట.

"మామయ్యా! మిమ్మల్ని నాన్నగారు ఆయన లైబ్రరీ రూమ్‌లో సెటిల్ అవమన్నారు" అంటూ నా సూట్‌కేస్ తీసుకొని ఇంటి వెనుక పాకలా ఉన్న ఓ పర్ణకుటీరం దగ్గరికి దూసుకొని వెళ్ళాడు. అప్పటిదాకా అది తాళం వేసుంది. రవి తాళం తీశాడు. నేను లోపలికి అడుగు పెట్టాను. ఆ గది చూడగానే నాకు అనిపించింది- మనిషన్నవాడికి అభిరుచి, ఆదర్శం ఉండి దానికి తగ్గ సంకల్పబలం ఉంటే ఎక్కడున్నాడో అక్కడే వాటిని సఫలం చేసుకోవడానికి కొన్ని ఏర్పాట్లు చేసుకోగలడని! గదిలో ఓ మూల రెండు రాక్‌ల నిండా పుస్తకాలు. గది మధ్యలో ఓ టేబుల్, రెండు కుర్చీలు, దానిమీద ఓ టూ ఇన్ వన్ ఫిలిప్స్ రేడియో, కొన్ని క్లాసికల్ మ్యూజిక్ క్యాసెట్లూ. గదిలో ఓ ఫ్యాన్. దానికింద ఓ మంచం, పక్కా. దాని పక్కనో స్టూలు, దానిమీద కూజా మంచినీళ్ళూ. ఇదీ సింపుల్‌గా చలపతిగాడి రీడింగ్ రూమ్. దాంట్లోకి నాలాంటి అప్తులకు తప్ప వేరేవాళ్ళకు ప్రవేశార్హత లేదనుకుంటాను. అందుకే ఇప్పటిదాకా తాళం వేసుంది.

నేను సూట్‌కేస్ తెరిచి లుంగీ కట్టుకునే సరికల్లా రవి తుపానులా వెళ్ళి, కాఫీ తెచ్చి ఇచ్చాడు.

"మామయ్యగారూ! మీరు కాఫీ తాగి విశ్రాంతి తీసుకోండి. నేను భోజనాల సమయానికి వచ్చి తీసుకెళతాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. కాఫీ తాగి కాసేపు చలపతి లైబ్రరీ తిరగేశాను. కాళీపట్నం, రాచకొండ, చలం, కొడవటిగంటి, బుచ్చిబాబు, గోపీచంద్, దేవరకొండ, మధురాంతకం, రంగనాయకమ్మ, ఓల్గా, శివారెడ్డి, పతంజలి, అల్లం రాజయ్య లాంటి మూడు తరాల రచయితలూ ఉన్నారక్కడ.

దేవరకొండ బాలగంగాధర తిలక్ *అమృతం కురిసిన రాత్రి* తిరగేస్తూ మంచం మీద పడుకున్నాను. ప్రయాణ బడలికకేమో మాగన్నుగా నిద్ర పట్టింది నాకు.



* * *

సాయంత్రం నాలుగు గంటలకు రెండు టూరిస్టు బస్సుల్లో పెళ్ళికి బయలుదేరాం. బస్సులో చలపతి నా పక్కనే కూర్చున్నాడు. "తెల్లవారుజామున నాలుగ్గంటలకల్లా తిరిగి ప్రయాణమై మన ఊరు వెళ్ళిపోతాం. రేపు మధ్యాహ్నం ఇంటిదగ్గర వ్రతం, భోజనాలు. రేపు సాయంత్రంకల్లా చుట్టాలు అందరూ వెళ్ళిపోతారు. నా భార్య పెళ్ళికొడుకునీ, పెళ్ళికూతుర్నీ తీసుకొని మూడు నిద్రలకు వెళ్ళిపోతుంది. మనం ఫ్రీ అయిపోతాం. రేపు రాత్రికి నీతో మాట్లాడేది చాలా ఉంది. ఎల్లుండి పొద్దున్నే నీ మానాన నువ్వు పోదువుగాని. అప్పటిదాకా నోరు మూసుకొని, వెళతాననూ గిడతాననూ అనకుండా పడుండు" అన్నాడు చలపతి. 'సుగ్రీవాజ్ఞ! చేసేదేముంది' అనుకున్నాను. చలపతికి నాతో తీరిగ్గా మాట్లాడడం కుదర్లేదు. ఎవరెవరో ఏదో అడుగుతున్నారు. వాడు సమాధానాలు చెబుతున్నాడు.

గుడ్లవల్లేరులో విడిది ముందు బస్సులు ఆగాయి.

అప్పటికి ఆరున్నరైంది. గుడ్లవల్లేరు చూసి చాలాకాలమైంది. కాలానుగుణంగా వచ్చిన మార్పులు ఎలా ఉన్నాయో పరిశీలించడానికి ఊళ్ళోకి బయల్దేరాను. నా పరిశీలన ఆయనెవరో చెప్పినట్లు విహంగ పరిశీలనే అని నాకు తెలుసు.

అయినా, పెళ్ళికింకా రెండు గంటల టైముంది. అప్పటిదాకా విడిదిలో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం కన్నా, విహంగ పరిశీలన వల్ల కొంత కాలక్షేపం అయినా లభిస్తుందని ఊరుమీద పడ్డాను. ముందుగా రైల్వే స్టేషన్ చూశాను. యథాతథంగానే ఉంది. బందరు నుంచి విజయవాడకు వేసిన రైల్వేలైన్ ప్రయాణికుల సౌకర్యార్థం ఉపయోగపడేది పావలావంతైతే, ఎగుమతి దిగుమతుల నుద్దేశించి బ్రిటిష్‌వాళ్ళు ఏర్పరచుకున్న ప్రధానలక్ష్యమే నేటికీ కొనసాగుతోంది. గుడ్లవల్లేరులో కోడిగుడ్లు పుష్కలంగా బండినిండా ఎక్కించబడుతూనే ఉన్నాయి.



చిత్రాలు: నర్సిం

వాటికి తోడు ఇప్పుడు చేపలు కూడా. రైల్వే స్టేషన్ నుంచి మళ్ళీ ఊరుమీద పడ్డాను. ఊరంతా చిన్నచిన్న చెరువుల మయంగా ఉంది. ప్రతి చెరువు మధ్యలోనూ పిల్లర్స్ మీద కట్టిన కోళ్ళ ఫారాలున్నాయి. కోళ్ళు తిని వదిలేసిన కోళ్ళ మేత, కోడిపెంటా కన్నాల్లోంచి చెర్లోకి ఊడ్చేస్తున్నారు. అది తిని కింది చెర్లో చేపలు పెరుగుతుంటాయి. ఆ విధమైన టూ-ఇన్-వన్ పరిశ్రమగా కోళ్ళు, చేపలు పెంచబడుతున్నాయి.

బ్రిటిష్‌వాడు తన వాణిజ్యావసరాల కోసం కోస్తా ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఫలితంగా ఇప్పటికీ ఆ ప్రాంతాలన్నీ అభివృద్ధిలో ముందున్నాయి. గుడ్లవల్లేరు చిన్నదే. అయినా, ఆర్థికంగా బలిసిపోయింది. ఊరు నిండా మారుతి కార్లు, హీరో హోండాలూనట. ఈ విషయం పెళ్ళిలో ఎవరో అన్నారు.

ఎనిమిదిన్నర దాకా తిరిగి తిరిగి విడిదికి చేరుకున్నాను. విడిది బయట షామియానా కింద కుర్చీల్లో అప్పటికే చాలామంది కూర్చొని ఉన్నారు. వాళ్ళకు పెళ్ళివాళ్ళు కూల్‌డ్రింక్‌లు సప్లయ్ చేసినట్టున్నారు.

నేనూ ఓ కుర్చీలో కూర్చున్నాను. అప్పుడొచ్చారు చలపతి మామగారు ఓ కూల్‌డ్రింక్ సీసా తీసుకొని. అది నా చేతిలో పెట్టి కుశల ప్రశ్నలు వేశారు.

"అవునయ్యా సూర్యం! మా అల్లుడికి నువ్వయినా చెప్పలేదా? మీరిద్దరూ మంచి దోస్తులు కదా! ఈ పెళ్ళేమిటి? దీనికింత ఆర్భాటం ఏమిటి? మగ పిల్లాడి పెళ్ళికి లక్ష రూపాయల ఖర్చా? పెళ్ళయిపోయిన తర్వాత ఖర్చయిపోయిన లక్ష రూపాయలూ మనకి గుర్తుంటాయి తప్ప! మనం చేసిన ఈ ఆడంబరాలు మూడోనాటికి పెళ్ళికి వచ్చిన వాళ్ళకెవరికైనా గుర్తుంటాయా? ఎందుకొచ్చిన ఖర్చు ఇది? మిడిసిపాటు తప్ప. నరేనయ్యా! వాళ్ళు కుర్రాడికి రెండెకరాల సుక్షేత్రమైన మాగాణి ఇచ్చి, యాభైవేలు క్యాష్ ఇస్తాం అన్నారు. పొలం వద్దు పొమ్మన్నాడు. మూడు లక్షలు క్యాష్ ఇచ్చి, కుర్రాడికి హీరో హోండా బండి, మణికట్టు చైనూ, ఇంకా ఏదో మెళ్ళో చైనూ అడిగాడట. వెర్రిపీనుగు కాకపోతే డబ్బు నిలబడు తుందా? పొలం అయితే పడుంటుంది. అయినా, ఈ బండ్లూ, మణికట్టు చైన్లూ ఎందుకటా? పైగా ఎవరైనా ఇదేమిటయ్యా అంటే, 'ఇది నా అభిప్రాయం కాదు, చేసుకునేవాడి అభిప్రాయం' అంటున్నాడు. కుర్రకుంక, వాడికి తలకాయ లేకపోతే పెద్దవాళ్ళం మనం ఆలోచించొద్దూ? ఈ ఊళ్ళో పొలం ఎకరం రెండు లక్షల దాకా ఉంది తెలుసా! వెంట్రుక ముక్క తెంపి ఇస్తే మొదలేదో, చివరేదో చెప్పలేని గుంట వెధవ మాటలకు విలువిచ్చిన తండ్రిని ఈతన్నే చూస్తున్నాను సుమా" అన్నారు ఆయన జడివాన కురిసినట్లు.

ఆయన మాటల ద్వారా విషయం సూక్ష్మంగా అర్థం అయినా, ఏ సమాధానం చెప్పాలో తెలియక వెర్రిముఖం వేసుకొని ఆయన వంక చూశాను.

ఆయన నా సమాధానం ఆశించి ఇదంతా చెప్పినట్లు ప్రవర్తించలేదు. చెప్పడం ద్వారా తన బాధ్యత తీరిపోయిందన్నట్లు, "వస్తున్నానోయ్ సుబ్బారావ్" అంటూ ఎవరి దగ్గరికో లేచి చక్కాపోయారు. ఆయనకు 75 ఏళ్ళు పైనే ఉంటాయి. అయినా, చలాకీగా, ఆరోగ్యంగా ఉంటారు. ఆయన ఆరోగ్య రహస్యం నాకు హఠాత్తుగా అర్థమైంది.

అల్లుడి నిర్ణయాలూ, పనులూ ఆయనకు నచ్చలేదు. ఆ విషయం కుండ బద్దలు కొట్టినట్లు నాకే చెప్పగా లేన్ది చలపతికి ఎందుకు చెప్పరూ? చెప్పే ఉంటారు. చలపతి అభిప్రాయం విని ఆయన మనస్తాపం ఏమీ చెందినట్లు లేదు. కుదేలయి పోయినట్లు కూడా లేదు. ఆయనకు కోపం వచ్చిందంతే అనుకుంటాను. ఆ కోపాన్ని నాలాంటివాళ్ళ దగ్గర వెళ్ళగక్కేసి ఆయన ఉపశమనం పొందు తున్నారనుకుంటాను.

ఇదే సమస్య నేనో, చలపతో ఎదుర్కోవాల్సి వస్తే ఎంత కిందమీదై పోయేవాళ్ళమో! అందుకే మా ఆరోగ్యాలిలా తగలబడ్డాయి అనుకున్నాను.

ఈలోగా "లేవండి, లేవండి. పెళ్ళివారు కబురు చేశారు. బయల్దేరదాం" అన్నారెవరో. అందరూ పొలోమని లేచారు. ఎదురు సన్నాహానికి బ్యాండు మేళం వచ్చింది. పెళ్ళికొడుకు, ఇంకెవరో కూర్చున్న చిన్న కారు ముందు బయల్దేరింది. వెనకాల చుట్టపక్కాలందరూ నడుస్తుండగా మేం పక్క వీదిలో ఉన్న పెళ్ళివారింటికి చేరుకున్నాం.

అదొక పెద్ద డాబా. డాబా ముందు పెద్ద ఖాళీస్థలం. అందులో షామియానా వేశారు. షామియానాలో పెద్ద పెళ్ళి మండపం కట్టారు. ఫైబర్ చెయిరూ, వాటిమధ్య పచ్చగడ్డి పరిచారు. పెళ్ళివారిల్లూ, షామియానా అంతా సీరియల్ లైట్ల సెట్లతోనూ, యాలజిన్ లాంపులతోనూ ధగధగాయమానంగా ఉంది.

వీడియో కెమేరామన్ ఫ్లాష్ లైట్లు ముఖాల మీద వేస్తూ షూటింగ్ మొదలుపెట్టాడు. ఓ పక్కన భోజనాలు ఏర్పాటు చేశారు. టేబుల్ మీల్సు కావాల్సినవారికి టేబుల్ మీల్సూ, బఫే కావాల్సినవారికి బఫే ఏర్పాటు చేశారు. కుర్రాళ్ళంతా జీన్ ప్యాంట్లతో, అమ్మాయిలంతా పంజాబీ డ్రస్సుల్లో హడావిడిగా తిరుగుతున్నారు.

పెద్ద పెద్ద స్టీరియో బాక్సుల్లో నుంచి సన్నగా పాటేదో వినిపిస్తోంది. కానీ, అర్థమై చావడం లేదు. ఈ పెళ్ళిలోని ఆడంబరాలూ, సౌకర్యాలూ, కల్చరూ- నాకో విషయాన్ని స్పష్టం చేశాయి. చంద్రబాబు నాయుడు చెప్పే హైటెక్- విజన్ 2020ని ఈ జనం రేపయినా నమ్మక చస్తారా! ఒకవేళ ఇలాంటివాళ్ళను చూసే ఆయనకా ఆలోచన కలిగిందేమో!

* * *

తెల్లవారుజామున నాలుగు గంటలకల్లా పెళ్ళి తతంగాలన్నీ ముగించుకొని రెండు బస్సులూ మళ్ళీ జొన్నపాడు బయల్దేరాయి. దారి పొడుగునా నేను బస్సులో కునికిపాట్లు పడుతూనే ఉన్నాను. ఇంటికి చేరాక నా పర్ణకుటీరంలోకి ప్రవేశించి తలుపులు బిగించుకొని, ఫ్యాన్ ఆన్ చేసుకొని, మంచం మీద పడి గొడ్డులా పది గంటలదాకా నిద్రపోయాను.

మా చలపతి వచ్చి లేపాడు. కాలకృత్యాలు, స్నానపానాదులూ అయిపోగొట్టుకొని తిరిగి మళ్ళీ మధ్యాహ్నం ఒంటిగంట దాకా నిద్రపోయాను. ఈసారి మా చలపతి కొడుకు వచ్చి నిద్ర లేపాడు. "వ్రతం అయిపోయింది మామయ్యగారూ! భోజనానికి రండి" అంటూ పిల్చాడు. లేచి వెళ్ళి భోజనం చేసి సాయంత్రం దాకా నిద్రపోయాను. రాత్రి 6-30

గుడ్లవల్లేరు చూసి చాలా కాలమైంది. కాలాను గుణంగా వచ్చిన మార్పులు ఎలా ఉన్నాయో పరిశీలించడానికి ఊళ్ళోకి బయల్దేరాను. నా పరిశీలన ఆయనెవరో చెప్పినట్లు విహంగ పరిశీలనే అని నాకు తెలుసు.

గంటలకు నా పర్ణకుటీరానికి- నాదేమిటి, వాడిదే ఆ లైబ్రరీ- మా చలపతి వచ్చి నన్ను లేపాడు.

నేను నిద్ర లేచి ఫ్రెష్‌గా స్నానం చేసి వచ్చాను. మా చలపతి టీ తెప్పించాడు. నేను టీ తాగి ఒక సిగరెట్టు ముట్టించాను.

అప్పుడు వాడు చెప్పాడు- "ఇల్లంతా ప్రశాంతంగా ఉందిరా. చుట్టాలంతా వెళ్ళిపోయారు. నా భార్య పిల్లాణ్ణి తీసుకొని మూడు నిద్రలకు వెళ్ళింది. సూరీ! నాకు కొన్ని సమస్యలు వచ్చిపడ్డాయి. నీకు వివరించి చెపుతాను. మొహమాట పడకుండా నాకు సలహా చెప్పు. నాకు నచ్చితే నీ సలహాలు పాటిస్తాను. లేదా తుంగలో తొక్కుతాను" అన్నాడు చలపతి నిదానంగా.

"చూడబ్బాయ్, వినేవాడుంటే చెప్పేవాడు ఎన్నైనా చెప్పవచ్చు. చెప్పేవాడికి వినేవాడు లోకువ. ఫైనల్ డెసిషన్ నీదే. నాకేం సలహాలు చెప్పడానికి! ప్రారంభించు. అయితే, ఓ కండిషన్. నాకు సిగరెట్లు లేవు. ఓ ప్యాక్ సిగరెట్లు తెప్పించి అప్పుడు ప్రారంభించు అన్నాను.

చలపతి తన కొడుకు రవిని పిల్చి, వాడే డబ్బిచ్చి, నా బ్రాండ్ సిగరెట్టు ప్యాక్ తెప్పించి, అప్పుడు ప్రారంభించాడు వాడి బాధాసప్తశతి. నేను సిగరెట్టు ముట్టించి మౌనంగా వినసాగాను.



నా అనుభవంలో నాకర్థమైంది ఏమిటంటే, పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నంతకాలం తల్లితండ్రులు హ్యాపీగా ఉండగలుగుతారు. పిల్లలకు వ్యక్తిత్వం ఏర్పడే కాలంలోనే తల్లితండ్రులకు కష్టాలు ప్రారంభమవుతాయి. అప్పటిదాకా మనం ప్లాన్ చేసుకొని నజావుగా నడిపించుకొంటున్న జీవితంలో, జీవన విధానంలో వాళ్ళొక కల్లోలాన్ని రేపుతారు. వయసు రీత్యా, అనుభవం రీత్యా స్థిరపడిపోయిన మన భావాల మీద, జీవన విధానం మీద ఈ కొత్తతరం, అంటే మన పిల్లలు భావావేశపూరితమైన యౌవన శక్తి తొణికిసలాడే దాడిని ప్రారంభిస్తారు. తరాల మధ్యన అంతరాల కారణంగా ఏర్పడే విచిత్ర పరిస్థితి ఇది. అప్పుడు ప్రతిదీ మన అదుపు తప్పుతున్నట్లూ, మన ప్లానూ, ఒద్దికగా అమర్చుకున్న జీవితమూ చెల్లాచెదరు చేయబడుతోందేమో, ఛిన్నాభిన్నం అయిపోతుందేమో అన్న అభద్రతాభావానికి మనం గురవుతాం. ప్రస్తుతం అదే నా పరిస్థితి" అని ఆగాడు చలపతి.

"రవి, వాడి తరువాత వాడూ ఇంకా చిన్నపిల్లలే కదా! ఇప్పుడు పెళ్ళయినవాడితోనా నీ ప్రాబ్లమ్స్?" అడిగాను నేను తాపీగా.

"అవున్రా! మా పెద్దబ్బాయి రాజును గురించే. వాడెలాగో కష్టం మీద డిగ్రీ అయిందనిపించాడు. తరువాత ఇంక చదవనన్నాడు. గుడివాడ ఏఎన్నార్ కాలేజీలో చదివించాను. డిగ్రీ చేస్తుండగా వీడికి అక్కడ దొరికిన ఫ్రెండ్స్ అంతా సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలూ, వ్యాపారస్థుల పిల్లలూ. వాళ్ళ తాలూకు కల్చరూ, అలవాట్లూ, జీవన విధానం మావాణ్ణి చాలా ప్రభావితం చేశాయి. సెకండియర్ చదువుతుండగా వాడు, 'బండైనా లేకుండా కాలేజీకి వెళ్ళడం ఎలా?' అన్నాడు. సరే, కుర్రాడు ముచ్చటపడి అడిగాడు కదా అని ఓ లూనా కొనిస్తానని చెప్పాను. 'లూనానా?' అని వాడు ముఖం చిట్లించాడు. తరువాత వాళ్ళమ్మకు చెప్పాడట. తన క్లాస్‌మేట్స్ అందరికీ హీరో హోండాలు, కవాసాకీలూ ఉన్నాయని. 'మనకంత శక్తి లేదు' అని వాళమ్మకు చెప్పాను.

డిగ్రీ ఫైనలియర్‌కి వచ్చాక ఓ ఉంగరం, చైనూ, బ్రేస్‌లెట్ కావాలని వాళ్ళమ్మను అడిగాట్ట. 'పోనీ, చేయించరాదూ! వస్తువులే కదా. వాడు వేసుకోవాలని ముచ్చట పడుతున్నాడు' అందావిడ.

'వాడు సంపాదించుకోవడం మొదలు పెట్టాక చేయించుకోమను. అప్పుడు వేసుకున్న నగలకూ, వాడికీ విలువ ఏర్పడుతుంది. డిగ్నిటీ, హుందాతనం ఎవరికి వాళ్ళు కష్టపడి ఏర్పరచుకోవాల్సిందే గానీ ఇతరుల్నించి దానంగా పొందేది కాదు' అన్నాను.

ఆవిడిక మాట్లాళ్ళేదు.

వ్యవసాయం ద్వారా పెద్ద ఆదాయం ఏమీ వచ్చి చావదనీ, అదే ఈ పదెకరాల పొలం అమ్మి వ్యాపారంలో పెడితే సంవత్సరానికి నాలుగైదు లక్షల ఆదాయం కళ్ళచూడవచ్చనీ, తన ఫ్రెండ్స్ వాళ్ళ కుటుంబాలన్నీ ఆవిధంగానే పైకి వచ్చాయనీ, తనకు చదువు మీద ఇంట్రస్టు లేదనీ, చదివినా ఈ రోజుల్లో ఎఫ్.సిలకు ఉద్యోగాలు దొరికే అవకాశాలు లేవనీ అనేకసార్లు వాడు వాళ్ళమ్మతో చెప్పాట్ట.

అనేకానేక సంఘటనలూ, వాడి అభిప్రాయాలూ, వాడు కోరుకుంటున్న జీవన విధానమూ వల్ల నాకు ఆ పిల్లాడు కలల్లో విహరిస్తున్నాడనీ, భూమ్మీద నిలబడి ఆలోచించడం లేదనీ అర్థమైంది.

తెల్లవారేసరికి కోటీశ్వరుణ్ణి అయిపోవాలనీ, కార్లలో తిరగాలనీ ఆ పిల్లాడు ఆలోచిస్తున్నట్లు కనపడసాగింది.

సరే, వాడికెటూ చదువు మీద ధ్యాస తగ్గింది. ఏదైనా వ్యాపారం పెట్టించి వాడి నిర్వాకం ఎలా ఉంటుందో పరీక్షించాలనుకున్నాను. వాళ్ళమ్మ కూడా సరే అంది. దానికి ముందు వాణ్ణి చాలాసార్లు కూర్చోబెట్టి నా సంసారం, సంపాదన, ఆస్తులూ అన్నీ వివరంగా చెప్పాను. నేను సంపాదించింది లేకపోయినా నా పెద్దలు ఇచ్చిన ఆస్తిని పోగొట్టలేదనీ, బడాయిలకు పోకుండా ఒకే స్థాయిలో సంసారాన్ని నడిపిస్తున్నాననీ, మధ్యతరగతి మనుషులూ, సంసారాలూ అతి పోకడలు పోతే మంచిది కాదనీ, నిలబడి నీళ్ళు తాగినా మంచిదే పరుగెత్తి పాలు తాగుదామని భంగపడడం కన్నా అని చెప్పాను. ఉన్నదాన్లో తృప్తి పడుతూ ఉండేంత ఉత్తమం లేదనీ, అందనిదాని కోసం అర్రులు చాచి ఆవేదన కొని తెచ్చుకోవడం అనవసరం అనీ చెప్పాను. నగలూ, విలాసాలూ, ఆడంబరాలూ మనిషికి గౌరవాన్ని తెచ్చిపెట్టవనీ, మనిషన్నవాడు ఏదో ఒకటి సాధించడం ద్వారా గౌరవం పొందగలుగుతాడనీ చెప్పాను. ప్లానింగ్ అన్నింటిలోనూ ఉండాలనీ, ప్లానింగ్ లేనివాడికీ, మూర్ఖుడికీ తేడా లేదని చెప్పాను. అహంకారం అందర్నీ దూరం చేస్తుందనీ, వినయం నేర్చుకోమనీ చెప్పాను. తరువాత వాడి చేత ఓ చిన్న వ్యాపారం రెండు లక్షలతో పెట్టించాను.

> "తరాల మధ్యన అంతరాల కారణంగా ప్రతిదీ మన అదుపు తప్పుతున్నట్లూ, మన ప్లానూ, ఒద్దికగా అమర్చుకున్న జీవితమూ చెల్లాచెదరు అవుతుందేమో అన్న అభద్రతాభావానికి మనం గురవుతాం. అదే ప్రస్తుతం నా పరిస్థితి."

*- ముగింపు వచ్చే సంచికలో*